# లక్ష్యం

సూర్యదేవర రామ్‌మోహనరావు

ఎప్పుడైతే, ఎక్కడైతే నీకు దురదృష్టం ఎదురవుతుందో, దాన్ని గతంలోకి నెట్టిపడేయ్.... భవిష్యత్‌మీదే నీ దృష్టిని, ఏకాగ్రతని కేంద్రీకరించు. గతం తాలూకు చేదు అనుభవం ఎదురవకుండా అప్రమత్తంగా వ్యవహరించు.

గొప్ప భవిష్యత్ కోసం నీవు ఎక్కబోయే ప్రతి మెట్టుకి గట్టి పునాది ఉందని భ్రమించకు--యముడి మాయా విన్యాసాలు---ఫేక్ ఇమేజెస్ నిన్ను నమ్మించి పడదోసేందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తుంటాయి, ప్రయత్నిస్తుంటారు.

మితిమీరిన అభద్రతా భావం నిత్యశంకితుడ్ని చేస్తే --ఎంతో కొంతయినా అది లేకపోతే ప్రతిక్షణం నీవు మోసానికి గురవుతావు-- మోసం ఫ్యాషనయింది గనుక.

కలలు ఖరీదైనవి కావు. ఎన్నైనా కనవచ్చు....

అలా అని వాటిని కంటూ పోతే పేకమేడల పిట్టగోడలపైనుంచి జారిపడే ప్రమాదం వుంది. ఆ కలల్ని నిజం చేసుకొనేందుకు అనవరతం శ్రమించు-- కలలు కనటం అబ్సెషన్ అయితే మిధ్యాజీవిగా మిగిలిపోవలసి వస్తుంది.
ప్రక్కవాడి ఎదుగుదలను చూసి ఉత్తేజాన్ని పెంచుకో-అసూయను కాదు.
మొన్నటిదాకా నా కళ్ళముందు తిరుగుతూ వుండేవాడే అంత గొప్పవాడు ఎలా అయ్యాడు?... అన్న ప్రశ్న దగ్గర ఆగి, తలుచుకుంటే నేనూ అవుతాను అని ప్రగల్భాలు పలికి పదింటికే పడకెక్కేసి కలల ప్రపంచాన్ని ఆశ్రయించటం అర్భకుల ఆరాటం.

అతనంతగా ఎదగటానికి చేసిన త్యాగాలు, పడిన శ్రమ, పెంచుకున్న పట్టుదల--కేటాయించిన పనిగంటలు, చేసిన హోమ్‌వర్క్ ఏమై వుంటుందన్న జిజ్ఞాసను పెంచుకొని, ఆ కేంద్ర బిందువు నుండి ఆలోచించటం, ఆదరించటం నేర్చుకుంటే -- ఎవరైనా ఆ స్థితికి, ఆ ఎత్తుకు చేరుకోగలరు.

Apply your self. Get all the education you can, but then, by God do something. Don't just stand then make some thing happen. It is not easy, but if you keep your nose to the grindstone and work at it, it is amazing how successful you can be.

నీ అదృష్టానికి పునాదిగా భగవంతుడ్ని నమ్మినా అభ్యంతరం లేదు-- ఆ భగవంతుడయినా నీకేదో చేయాలన్నా, అందుకు నీకై నీవు సాధించుకున్న అర్హతేమిటి, నువ్వు చేసిన ప్రయత్నాలేమిటి? తొలుత నీలో నీకు తెలీకుండా వున్న అంతర్గత శక్తుల్ని గురించి తెలుసుకో-- వాటిని ఈ ప్రపంచంలో ఎవరికి, ఎలా, ఏ రూపంలో అమ్మాలో తెలుసుకో-- అమ్మేది అవసరమైందే అయితే కొనేవాళ్ళు ఎప్పుడూ వుంటారు.

You should learn to tap hidden resources in you. Then you will know how to establish effective relationships at work so that you can confidently climb up ladder, rung by successful ring.

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పాపులారిటీని, ఇమేజ్ని సంపదని కీర్తి ప్రతిష్టల్ని స్వంతం చేసుకున్న గొప్ప వ్యక్తులకన్నా, తెలివికలవాళ్ళు, సామర్థ్యం వున్నవారు చాలా మంది సాధారణ ప్రపంచంలో వున్నారు.

మరి వాళ్ళెందుకు అలా ఎదిగారు?

వీళ్ళెందుకు ఇక్కడే వుండిపోయారు? అర్భకులు, అసమర్థులు, తెలివిహీనులు, మూఢులు, సృజనాత్మకతకు అర్థం తెలీనివాళ్ళు కూడా ఎంతో ఎదుగుతూ, మరెంతో సంపాదిస్తున్నారు?

చాలా మందికి, చాలాసార్లు అనిపిస్తుంది ఆ పిచ్చివెధవ అంత పైకెళ్ళాడేమిటి? ఆ అర్భకుడు అంతెలా సంపాదిస్తున్నాడని---

అతను చేసిన పనినిచూసి అంతకంటే నేనే బాగా చేసుండేవాడ్నే అని వాపోతుంటారు.

నిజమే......చేయగలరు.

కాని.......ఒక్కతేడా వుంది.

అతనికున్న కేవలం ఐదు శాతం తెలివితేటల్ని, తొంభైఐదుశాతం మాటకారితనానికి జోడించి, జమిలిగా తగిలే వెర్రిబాగులవాళ్ళను పెట్టుబడి దారులుగా చేసి, పెట్టుబడి పెట్టించి పైకెళుతుంటారు........ అది తప్పా.......?కానేకాదు.

పిల్లికి మొదటి గంట కట్టటమే కష్టం. అందుకే మీ తెలివితేటల్ని అమ్ముకోవటం ఆరంభించండి-- అవి కరెన్సీ క్రింద మారటం గమనించండి.తలుచుకుంటే ఎవరైనా ఏదైనా కాకపోయినా, ఏదో ఒకటి చేయగలరు. ఎంతో కొంత సాధించగలరు.

ప్రగల్భాలు అనర్థం..... కలలు  అరిష్టం.... అసూయా ద్వేషాలు అన్నివిధాలా నష్టం.

నీకై నీవే ఒక జైలుని నిర్మించుకో-- ఆ జైలుకి నీవే సర్వాధికారివి-- అందులో ప్రతిష్టింపబడు-- రంగుల ప్రపంచాన్ని, హంగుల హరివిల్లుని మరిచిపో కొంతకాలం. నమ్ముకున్నదానిపై దృష్టిని కేంద్రీకరించు-- రాత్రింబవళ్ళు శ్రమించు-- అప్పుడు నీవున్న జైలు ద్వారాల్ని నీ అవసరం వున్నవాళ్ళే తెలిసి నిన్ను తమ ప్రపంచంలోకి తీసుకెళ్ళి, ఎదిగేలా చేస్తారు. పెరిగేలా తోడ్పడతారు. కొందరుంటారు-- పాపం ఓపికుంటే శ్రమిస్తారు లేదంటే విశ్రమిస్తారు... మరీ కాదంటే శ్రమించేవారిని విశ్రమించేలా చేస్తారు.

అవిగో లక్షలు వస్తున్నాయి.

ఇవిగో కోట్లు వస్తున్నాయంటారు.....

మరవన్నీ ఏం చేస్తున్నావంటే నా మెయిన్‌టెనెన్స్‌కి సరిపోతున్నాయంటారు...?!

ఏటి ఈత-----లంకమేత....... ఎవర్ని ఉద్ధరిస్తుంది?

సాయిబు సంపాదన....... బూబు కుట్టుకూలికి సరిపోతే ఏం సాధించినట్లు?

సాయంత్రానికి ట్రిమ్ముగా తయారై-- సుష్టుగా తిని, మత్తుగా తాగి, అర్ధరాత్రి ఇంటికొచ్చి ఆపసోపాలతో పడకలెక్కేస్తారు-- తిరిగి సూర్యుడు కృంగే సమయానికి లేస్తారు.

పాపం వారి జీవితం ఏమిటో.......?

వాళ్ళ ధ్యేయం ఏమిటో ఎవరికీ అర్థంకాదు.

ఎదిగే సమాజాన్ని, దేశాన్ని ఎదగకుండా చేసే చెదపురుగులు వాళ్ళు-- వారిపై మానసిక క్రిమిసంహారక మందులు వాడక తప్పదు.

ఈ దేశం బాగుపడదని ఎవరన్నారు? ఎవరంటారు?

సోమరిపోతులు...... మన ఖర్మంతే అని ఎవరు వాపోతారు? మెంటల్ ఇంపొటెంట్ ఎప్పుడంటే ఖాళీగా కూర్చునే వాళ్ళ కాళ్ళు విరగ్గొట్టినప్పుడు........ పనీ పాటా లేక ఊసుపోని కబుర్లు చెప్పే ఉత్త బడుద్ధాయిల్ని ఉరితీసినప్పుడు.

రండి... కదలండి....... కదన రంగానికి ఉరకండి...... తెలివితేటల్ని ఉపయోగించండి.......రాత్రింబవళ్ళు శ్రమించండి.

ఎదుగుదల తల ఒంచక ఏంచేస్తుంది? విజయం వరించక ఎక్కడ ఉరేసుకుంటుంది?

India.......

The Great India......

Love it..

Do it........

Or Leave it.........

Let's Make India Great Again
Let's Get India Moving Again But.
Our Future is in Indian Politicians Hands-
అది ఇక సంభవింపరాదు.

రాజకీయ నాయకులు నిలబడేది--- గెలిచేది వారికోసం-- వాళ్ళ వాళ్ళకోసం-- మనకోసం కాదు-- వాళ్ళు మనకేమీ చేయరు--

మనకు మనమే ఏదో ఒకటి చేసుకోవాలి.

బ్రతికున్నవాడు ఏదో ఉద్ధరించినట్లు బర్త్‌డేలు, చచ్చినవాడు ఏదో ఊడబొడిచి వెళ్ళినట్లు తద్దినాలు......... పురుళ్ళు, పుణ్యకార్యాలు..... పండుగలు........ పబ్బాలు ...... ఫంక్షన్స్....... చచ్చినా సంబరమే...... బ్రతికినా పండుగలే..... వాటిని భరించే స్థితి ఈ దేశానికి యిప్పుడు వుందా? లేదు.

ప్రతి సంవత్సరం వీటికి దేశ వ్యాప్తంగా ఐదువేల కోట్లు ఖర్చు అవుతున్నాయట-- సిగ్గుగా లేదు మనకు---

ఎన్ని సార్లని, ఎన్నిటికని మనం మాత్రం సిగ్గుపడతాం? మనం పడే సిగ్గుకే సిగ్గేసేస్థితి--- మనమీద మనమే జాలిపడే స్థితి....

అందుకే **Let's get Indian youth moving again......**
ఇతరుల చేతుల్లో నలుగుతున్న మన జీవితాల్ని మనం లాగేసుకుందాం....... మన భవిష్యత్ పగ్గాలు మన చేతుల్లో లాక్కుందాం.......

Let's Move...........
Let's Drive............
Let's Dig........
For Our for tune........

* * * *

బెంగుళూరు మహానగరం...

గార్డెన్‌సిటీ.... రహదారుల కిరువైపులా పెరిగిన మహావృక్షాలు, వాస్తుకళ కే చాలెంజ్‌గా నిలిచే పురాతన కట్టడాలు...... వాటి పరిసరాల్లో పుట్టుకొచ్చిన అధునాతనమైన బంగ్లాలు...... ప్రతి రెండు కిలోమీటర్ల కొక పార్క్.... ప్రతి ఇంటిముందు పూల పొదలు.... ఖాళీ అనుకొనే ప్రతి చోటా పుట్టుకొచ్చిన వృక్షాలు ...... ఓహో..... ఎక్కడ చూసినా పచ్చదనం.. కనుల పండుగగా కన్పించే రంగు రంగుల గులాబీలు... రన్ అవుట్ అయ్యేవరకు కెమేరా గురించి పట్టించుకోకుండా అలా ఆ అందాలకేసి చూసేలా చాయా చిత్ర గ్రాహకుల చూపుల్ని నిలవేసే అందాలు.

అప్పుడు ఉదయం ఆరు గంటలు...

చామరాజ్ పేటలోని ప్రకాష్ కేఫ్‌కి దగ్గర్లో ఉన్న టిప్పుసుల్తాన్ సమ్మర్ ప్యాలెస్ ముందు ఒక టూరిస్టు బస్ వచ్చి ఆగింది.

ఆ చుట్టుప్రక్కల వున్న హోటల్స్‌లో ఆక్స్‌ఫర్డ్ కాలేజీకి చెందిన డిగ్రీ స్టూడెంట్స్ షుమారు నలభైమంది దాకా బస చేసి వున్నారు.

వాళ్ళని అక్కడనుండి కూర్గ్ జిల్లాకు తీసుకెళ్ళి కాఫీ తోటల్ని, తిరుగు ప్రయాణంలో నాగర్ హోలే ఫారెస్ట్ గుండా తీసుకువస్తూ, ఆ దట్టమైన అడవిని, వేల సంఖ్యలో సంచరించే ఎలిఫెంట్స్‌ని చూపించటమే ఆ బస్ డ్రైవర్ ప్రస్తుత బాధ్యత.

"ఏరా ఈ పిల్లకాయలింకా రాలేదు?" డ్రైవర్ గేర్‌ని, బ్రేక్స్‌ని చెక్ చేసుకుంటూ అడిగాడు.

"ఈ పాటికి బయలుదేరే ఉంటారు" క్లీనర్ రేడియేటర్‌లో వాటర్ పోస్తూ అన్నాడు.

రోడ్డంతా దాదాపు నిర్మానుష్యంగా ఉంది.

ఉండుండి ఒక్కో వెహికిల్ ఫాగ్ లైట్స్ వెలుగులో వెళ్ళిపోతోంది.

పదడుగుల తరువాతేముందో కనిపించనంత దట్టమైన పొగ మంచు... ఒకింత చలిగా కూడా వుంది...... పూర్ విజన్...

బెంగుళూరు మొదలు, పశ్చిమ పర్వత శ్రేణులను కలుపుకొని, అరేబియా సముద్రాన్ని తాకే మంగుళూరు, ఉడిపి వరకు చిక్కటి పొగ మంచు.... అలలు అలలుగా, తెరలు తెరలుగా సాగిపోతూ హిమాలయాల మృదుత్వాన్ని స్మరింపజేస్తోంది.

సిమ్లా, ముస్సోరీ, నైనిటాల్‌ని మరిపించేలా వుంది బెంగుళూరు నగర ఉషోదయం. టెంపరేచర్ బాగా దిగిపోయి ఉండడంతో ఉదయానే జాగింగ్ వెళుతున్నవాళ్ళు ఆ కోల్డ్ వేవ్‌ని తట్టుకొనేందుకు, హెవీటాడ్ సూట్స్, లెదర్ జాకెట్స్ వేసుకొని రోడ్డువారగా పరుగులు తీస్తున్నారు.

“ఇప్పుడు మనం వెళ్ళబోయేది ఎక్కడికో తెలుసా.......?” సన్నగా, పొడుగ్గా బంగారు గోధుమరంగు చాయతో, నల్లటి చిక్కటి పొడవాటి జుత్తుతో అందానికే వంక పెట్టేలా ఉన్న మహతి అంది. ఆమె కంఠం సితారని మీటినట్లుగా శ్రావ్యంగా వుంది.

“కూర్గ్ జిల్లాకి......” పెదాలకి లిప్‌స్టిక్ రాసుకుంటున్న సుధారాణి అంది చాలా కేజువల్‌గా.

అద్భుతమైన ప్రదేశానికి వెళుతున్నామన్న ఎక్సైట్‌మెంట్ ఆమె కంఠంలో తొంగిచూడకపోవటంతో మహతి ఆశ్చర్యపోయింది.

“అది అందరికీ తెలుసు.. కూర్గ్ జిల్లాకి మరో పేరుంది-అదే కొడగు, పరుగులరాణి అశ్వనీ నాచప్ప పుట్టింది అక్కడే. పరుగు పరుగున ప్రవహిస్తూ కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల బంజరు భూముల్ని సస్యశ్యామలం చేసే కావేరీ నది పుట్టింది ఆ కొడగులోనే....... తెలుసా?” తన్మయంగా అంది మహతి.

సుధారాణి తను చేస్తున్న పనిని పూర్తి చేసి, తన రెండు పెదాల్ని ఒత్తిడికి గురి చేసుకుంటూ నోటి లోపలకు ఒంచుకొని, తిరిగి అద్దంలో చూసుకొని సంతృప్తిపడింది.

“అవునూ...... అదేమిటే మహి..... అబ్బాయిల్ని ప్రకాష్ కేఫ్‌లో, అమ్మాయిల్ని ఈ హోటల్‌లో వుంచాడు మన సోడాబుడ్డి.....” సుధారాణి బ్యాగ్‌ని భుజానికి తగిలించుకుంటూ అంది.

“నీలాంటివాళ్ళ చేష్టలకు భయపడి  అలా చేసుంటారు మన ఎకనమిక్స్ లెక్చరర్‌గారు. పద.....పదా... బస్ ఈ పాటికి వచ్చే వుంటుంది” అంటూ అప్పుడే వచ్చింది మేరీ.

“పోవే.....పాతకాలపు అమ్మమ్మ... వంద జన్మలకో మానవజన్మ.... పోతే తిరిగి రాదు. ఉన్నప్పుడే అనుభవించాలి. సహజవనరుల్ని వినియోగంలోకి తెచ్చుకోకపోతే దేశం ఎలా సస్యశ్యామలం కాదో-- మనమూ అంతే..... అర్థమయిందా...?” అంటూ సుధారాణి బయటకు నడిచింది.... మితిమీరిన వల్నర్‌బిలిటీ....

మహతికి సుధారాణి భావం అర్థమైంది. ఒక్క క్షణం ఆమెకేసి అసహనంగా చూసి ముందుకు కదిలింది.

కాస్త వెనుకా, ముందుగా ఇరవైమంది అమ్మాయిలు పర్వతారోహకుల్లా తయారయి హోటల్ నుంచి బయటకు వచ్చారు.

“ఇలాగయితే ఎలాగమ్మా.... ? సరిగ్గా ఆరింటికి బస్ బయలు దేరాలి” అసంతృప్తిని వ్యక్తంచేస్తూ అన్నాడు బస్‌క్లీనర్.

“అబ్బాయిలొచ్చారా?” సుధారాణి సల్వార్ కమీజ్‌ని సరిచేసుకుంటూ అడిగింది.

“వాళ్ళకోసం మా వాడు వెళ్ళాడు. మీరు త్వరగా బయలుదేరండమ్మా...” అంటూ అతను వారిని సాగదీస్తూ ముందుకు నడిచాడు వడి వడిగా.

సరిగ్గా ఇదే సమయంలో ఇరవైమంది విద్యార్థులు ప్రకాష్ కేఫ్ నుంచే బయటపడి రోడ్డెక్కారు.

“టిప్పుసుల్తాన్ కథ అభూతకల్పన... అదే టీవీలో వచ్చింది” అన్నాడు విజయ్ అనే విద్యార్థి బస్‌దిక్కుకేసి కదులుతూ.

“అవును-పచ్చి అబద్ధం టిప్పూకి పరమత సహనం అసలులేదట. మైసూర్ మహారాజుని మరీ బఫూన్‌లా చిత్రీకరించారు. ఎవడో గిద్వానీ అట- చరిత్రని

వక్రీకరించాడు. మైసూరు మహారాజు 'ది స్వోర్డ్ ఆఫ్ టిప్పు సుల్తాన్' లో చూపించినట్లు పిరికివాడేంకాదు" అని సురేష్ అనే విద్యార్థి అన్నాడు కోపంగా.

ఆ అందరికీ నాయకుడిగా కనిపించే విద్యార్థి పేరు మధుకర్. అతనేం మాట్లాడలేదు.

అందరూ మింటోస్ ఐ హాస్పిటల్ చౌరస్తా దాటుతుండగా అన్నాడు మధుకర్--

"సంజయ్‌ఖాన్ చూపించిన చరిత్ర తప్పని చెప్పటానికి క్లైమాక్స్ చాలు. టిప్పు సుల్తాన్ ప్యాలస్ ప్రక్కగా కావేరీ నది ప్రవహిస్తుంది. ఆ కావేరీ నది ఒడ్డునే శ్రీరంగపట్టణం వుంది. రివర్‌వైపున్న కోట తలుపుల్నే, టిప్పూకి వ్యతిరేకవర్గం తెరచి బ్రిటిష్ సైన్యాన్ని లోపలకు తీసుకెళ్ళటం జరిగింది. చివరి పోరాటంలో కూడా టిప్పుసుల్తాన్ తీవ్రంగా గాయపడ్డాక టిప్పు శరీరాన్ని చాలా దూరం లాక్కువెళ్ళిందట. టిప్పుశవం దొరికిన స్థలాన్ని చరిత్రకారులు గుర్తించారట. అదిప్పటికీ ఉందట. వచ్చేప్పుడు మనం చూద్దాం" అన్నాడు మధుకర్ ఒకింత అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తూ.